సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 30 । ఏప్రిల్ । 2025



రండి.. ఆడండి

విద్యార్థులకు వేసవి సెలవుల నేపథ్యంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా శిబిరాలు నిర్వహిస్తోంది. మే 1 నుంచి 31 వరకు ఆటలపై శిక్షణ ఇవ్వనుంది. -8లో



ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు

బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌పై ఉన్న గంగోత్రి చెరువులో ఈతకు దిగిన యువకుడు గల్లంతయ్యాడు. అతన్ని కాపాడేందుకు మిత్రులు చేసిన ప్రయత్నం విఫలమైంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 398 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	-	-
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 79.260 కిలోలు

న్యూస్‌రీల్

నేడు పాలిసెట్ పరీక్ష

రాజంపేట: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నికల్ కళాశాలల ప్రవేశాలకు సంబంధించి పాలిసెట్ పరీక్ష బుధవారం నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి 1 గంట వరకు జరుగుతుంది. పట్టణంలో మూడు సెంటర్లలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 975 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇప్పటికే హాల్‌టికెట్లను రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తేడాలు ఉంటే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 9.30 గంటలకు పరీక్షా కేంద్రం వద్దకు చేరుకోవాలి. తమ వెంట ఆధార్‌కార్డు తెచ్చుకోవాలి.

డీఈఈ సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

రాయచోటి అర్బన్: రాష్ట్రంలో రెండు సంవత్సరాల డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ) కోర్సులో ప్రవేశానికి సంబంధించిన డీఈఈ సెట్ - 2025 నోటిఫికేషన్ విడుదలైనట్లు డైట్ ప్రిన్సిపల్ అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఏప్రిల్ 29 నుంచి మే 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. మే 20న హాల్‌టికెట్లు విడుదల, జూన్ 2,3 తేదీలలో పరీక్ష, 10న ఫలితాల ప్రకటన ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాల ఎంపిక, అభ్యర్థుల అర్హతల నిబంధనలు, కోర్సు ఎంపిక విధానం తదితరాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని వివరించారు.

నేడు లైట్లు ఆఫ్ చేసి నిరసన

కడప కల్చరల్: ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశాల మేరకు వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా బుధవారం రాత్రి లైట్లు ఆఫ్‌చేసి నిరసనలు తెలియజేయాలని వక్ఫ్ పరిరక్షణ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. రాత్రి 9 నుంచి 9.15 వరకు 15 నిమిషాల వరకు ఇంటిలో, దుకాణాలు, సంస్థలు, కార్యాలయాలు, వ్యాపార సంస్థల్లో లైట్లు ఆఫ్ చేసి ప్రతి ఒక్కరూ తమ నిరసనలు తెలియజేయాలని కోరారు.

4న లాంగ్‌మార్చ్



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా మే 4వ తేదీ ఆదివారం జరిగే లాంగ్ మార్చ్‌ను విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరంలోని అంజద్‌బాషా కార్యాలయంలో పార్టీ నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత జమ్ము కశ్మీర్ రాష్ట్రంలోని పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడి లో మరణించిన వారికి స్మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ముంతాజ్ బేగం, వైఎస్సార్ సీపీ నాయకుడు జమాల్‌వలీ, పెద్దిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అల్లాబక్షు, అల్తాఫ్, బీహెచ్ ఇలియాస్, త్యాగరాజు, వినోద్, జమీల్, బాబు, కార్పొరేటర్లు పాకా సురేష్, షఫీ, బసవరాజు, బాలస్వామిరెడ్డి, షంషీర్, చాక్లెట్ గౌస్, మల్లికార్జున, కోఆప్షన్ సభ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు ఉన్నారు.

బాల్య వివాహాలకు పాల్పడితే చర్యలు

రాయచోటి అర్బన్: జిల్లాలో బాల్యవివాహాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఐసీడీఎస్ పీడీ రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్షర తృతీయ పండుగను పురస్కరించుకుని జిల్లాలోని దేవాలయాల్లో బాల్య వివాహాలు జరిగే అవకాశం ఉన్నందున వాటి నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లా దేవదాయ శాఖ ఉన్నతాధికారులతో కలసి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఆలయాల అధికారులు, పురోహితులకు బాల్య వివాహ నిషేధ చట్టంను కఠినంగా అమలు చేయాలని ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. ఆలయాల్లో వివాహాలు చేసుకోదలచిన వారి వయసు ధ్రువీకరణ పత్రాలు (ఆధార్‌కార్డును ప్రామాణికంగా తీసుకోకూడదు) టెన్త్ మార్కులిస్టు, ప్రభుత్వం జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్లు, పాఠశాల రిజిస్టర్‌లో నమోదు చేసిన తేదీని ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. బాల్యవివాహ చట్టం ప్రకారం యువతులకు 18 ఏళ్లు, యువకులకు 21 ఏళ్లు పూర్తయి ఉండాలన్నారు. లేనిపక్షంలో పెళ్లికి సహకరించే షామియానా షాపుల వారు, క్యాటరింగ్ సిబ్బంది, ఫొటోగ్రాఫర్స్, పురోహితులు, వాయిద్యకారులు, వివాహం కుదిర్చిన వ్యక్తులు, వివాహానికి హాజరైన పెద్దలు తదితరులు శిక్షార్హులవుతారన్నారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే బాల్యవివాహ నిషేధాధికారులైన ఆర్‌డీఓ, ఐసీడీఎస్ సీడీపీఓ, సూపర్‌వైజర్లు, పంచాయతీ సెక్రటరీలు, వీఆర్‌ఓలు, తహసీల్దార్లు, చైల్డ్‌వెల్ఫేర్, పోలీసు, సచివాలయం అడ్మిన్ సెక్రటరీ, మహిళా సంరక్షణ కార్యదర్శులకు ముందస్తుగా తెలిపి సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

భూ రాబందులు

- రూ.3 కోట్ల విలువైన డీకేటీ భూమిపై కన్ను
- అధికారం అండతో దర్జాగా కబ్జాకు యత్నం
- పోలీసులను లెక్క చేయకుండా ఫెన్సింగ్ పనులు
- రైతుల ఫిర్యాదుతో అడ్డుకున్న రెవెన్యూ శాఖ



రెవెన్యూ శాఖ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



రేగడ సమీపంలోని ఐదు ఎకరాల డీకేటీ భూమి



ఫెన్సింగ్ కోసం తోలిన రాతి కూసాలు

కురబలకోట: రెవెన్యూ ఆధీనంలోని మూడు కోట్ల విలువైన డీకేటీ భూమిని కొట్టేయడానికి ఏకంగా స్కెచ్ వేశారు నాయకులు. అధికార మదంతో సొంతం చేసుకోడానికి హల్‌చల్ చేశారు. భూములు రేట్లు పలుకుతుండటంతో 'వదల బొమ్మాళీ' అన్నట్లుగా డీకేటీ భూములపై భూ రాబందులు రెక్కలు చప్పుడు షురూ చేశారు. పరిసర ప్రాంత రైతులను భయభ్రాంతులకు గురి చేశారు. అంతే కాదు నేరుగా కిరాయి మనుషులతో మంగళవారం వచ్చి ప్రభుత్వ స్వాధీనంలో ఉన్న ఐదు ఎకరాల రెండు సెంట్ల భూమికి కూసాలు నాటి ఫెన్సింగ్ (కంచె) వేసే పనులు చేపట్టగా.. పరిసర ప్రాంత రైతులు గుర్తించి వెంటనే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. భూ కబ్జాదారులు ఉదయం నుంచి వేసిన ఫెన్సింగ్‌ను రెవెన్యూ అధికారులు కూల్చివేసి వారి దురాక్రమణ చర్యలకు అడ్డుకట్ట వేశారు. ఈ భూ ఆక్రమణ వెనుక అధికార పార్టీకి చెందిన నాయకులు ఉన్నట్లు సమాచారం.

కిరాయి మనుషులతో..

కురబలకోట మండలం ఎర్రబల్లి గ్రామం రేగడ సమీపంలో సర్వే నంబరు 1867-1లో ఐదు ఎకరాల రెండు సెంట్ల ప్రభుత్వ డీకేటీ భూమి ఉంది. 2022లో ఈ భూమిని ఇతరులకు విక్రయం చేయడానికి పట్టాదారు యత్నించగా.. అప్పటి రెవెన్యూ అధికారులు ఈ భూమిని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాదు ఈ భూమిలో ఎవరూ ప్రవేశించరాదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ఆ బోర్డు ఉంది. ఈ క్రమంలో ఈ భూమిపై మదనపల్లికి చెందిన అధికార పార్టీ నాయకులు కన్నేశారు. రెండు రోజుల ముందు ఈ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయడానికి వందల కూసాలు తోలారు. మంగళవారం ఏకంగా ఈభూమి చుట్టూ కిరాయి మనుషులతో ఫెన్సింగ్ వేయసాగారు. తగిన రికార్డులు లేవని అధికారులు చెబుతున్నారు. పైగా ఇది రెవెన్యూ స్వాధీనంలో కూడా ఉంది. గతంలో ఈ భూమి కేసు కోర్టులో కూడా రెవెన్యూకు అనుకూలంగా వచ్చింది. రికార్డులలో కూడా డీకేటీ భూమి అని రెవెన్యూ స్వాధీనంలో ఉంది. ఇది రియల్ ఎస్టేట్ ధర ప్రకారం దాదాపు మూడు కోట్ల రూపాయల విలువ చేస్తోంది. ఇలాంటి భూమిపై సరైన రికార్డులు లేకుండా దౌర్జన్యంగా ఆక్రమించుకునే యత్నం చేయడం దారుణమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు రంగ ప్రవేశం



భూ కబ్జాకు యత్నించిన వారిపై మండిపడుతున్న ఎంఆర్‌ఐ బాలసుబ్రమణ్యం

డీకేటీ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేస్తున్న విషయాన్ని పరిసర ప్రాంత రైతులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు పోలీసులను పంపారు. భూ కబ్జాదారులు వీరిని కూడా లెక్క చేయకుండా ఫెన్సింగ్ పనులు చేయసాగారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు తపస్విని హుటాహుటిన ఎంఆర్‌ఐ బాలసుబ్రమణ్యం, మండలంలోని వీఆర్వోలను సంఘటన స్థలానికి పంపారు. వారు వచ్చినా ఫెన్సింగ్ పనులు చేయసాగారు. 'పనులు ఆపు చేస్తారా.. కేసులు పెట్టమంటారా..' అని ఎంఆర్‌ఐ ఒక్క సారిగా హూంకరించడంతో అప్పటి వరకు గడ్డపారలతో మొండిగా ఫెన్సింగ్ వేస్తూ వచ్చిన కిరాయి మనుషులు కాళ్లకు బుద్ధి చెప్పారు. అక్కడి నుంచి మెల్లగా జారుకున్నారు. మరి కొందరు పరారయ్యారు. దీంతో ఎంఆర్‌ఐ అప్పటికప్పుడే ఉదయం నుంచి భూ కబ్జాదారులు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను వీఆర్వోల సాయంతో కూల్చివేయించారు. రికార్డులు ఉంటే చూపాలని కబ్జాకు యత్నించిన వారిని కోరినా.. వారు అదిగో ఇదిగో అంటూ చెప్పసాగారు. ఏ హక్కు ఉందని రెవెన్యూ స్వాధీనంలో ఉన్న భూమి కబ్జాకు వచ్చారని రెవెన్యూ అధికారులు ప్రశ్నించారు. ఈ భూమిని కొన్నామని కబ్జాదారులు చెప్పుకొచ్చారు. 'ఇది డీకేటీ భూమి, కొనడానికి మీరెవరు.. అమ్మడానికి వాళ్లెవరు' అంటూ రెవెన్యూ అధికారులు నిలదీశారు. ఎర్ర బంగారంలా ఉన్న చదునైన ఈ భూమిని మరోసారి రెవెన్యూ అధికారులు పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. భూ కబ్జాదారులను హెచ్చరించడంతో వారు వెళ్లిపోయారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. కాగా భూ పత్రాలు లేకుండా ఏ అండ చూసుకుని రెచ్చిపోయారన్నది ఇటు స్థానికులకు, అటు అధికార యంత్రాంగానికి ఆశ్చర్యాన్ని కల్గిస్తోంది. ఈ భూ కబ్జా యత్నం వెనుక ఉన్న అధికార పార్టీ నాయకుడు ఎవరన్నది అంతటా చర్చనీయాంశంగా మారింది.



కబ్జాదారుల ఫెన్సింగ్‌ను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలు



ఇది డీకేటీ భూమి. 2022లో ఈ భూమి రెవెన్యూ స్వాధీనం (పీఓటీ)లో ఉంది. ఇలాంటి భూమిని దౌర్జన్యంగా కబ్జా చేయాలని చూడటం ఆక్షేపణీయం. దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నాం. కబ్జాకు యత్నించిన వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మండలంలో అక్రమంగా డీకేటీ భూముల్లోకి చొరబడాలని చూస్తే వారు ఏ స్థాయిలో ఉన్నా క్రిమినల్ చర్యలు తప్పవు. ఈ భూమిని ప్రభుత్వ లేదా ప్రజా ప్రయోజనాలకు వినియోగిస్తాం.

-తపస్విని, తహసీల్దారు, కురబలకోట మండలం

రాజంపేట పార్లమెంటు పరిశీలకుడిగా సురేష్‌బాబు

- కడప పార్లమెంటు పరిశీలకుడిగా కొండూరు అజయ్‌రెడ్డి
- తిరుపతి పార్లమెంటు పరిశీలకులుగా ఎంపీ రఘునాథ్‌రెడ్డి
- హిందూపురానికి రమేష్‌కుమార్‌రెడ్డి..



కె.సురేష్‌బాబు



కొండూరు అజయ్‌రెడ్డి



మేడా రఘునాథరెడ్డి



ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి

సాక్షి రాయచోటి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతంతోపాటు ఎక్కడికక్కడ అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ అధిష్టానం ప్రత్యేక చర్యలకు ఉపక్రమించింది. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఆందోళనలతోపాటు ఇతర అక్రమాలను నిలదీయడంలో భాగంగా.. పార్లమెంటు నియోజకవర్గాలకు పరిశీకులను నియమించింది. అందుకు సంబంధించి కడప పార్లమెంటు పరిశీలకులుగా స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేత కొండూరు అజయ్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా పార్లమెంటుకు సంబంధించి పరిశీలకులుగా కడప నగర మేయర్ కె.సురేష్‌బాబును నియమించారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా పని చేసిన అనుభవంతోపాటు జెడ్పీ చైర్మన్‌గా కూడా సురేష్‌బాబు పని చేసి ఉన్నారు.

- తిరుపతి పార్లమెంటు పరిశీలకులుగా రాజంపేటకు చెందిన రాష్ట్ర నాయకులు, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డిని పార్టీ నియమించింది. తిరుపతి జిల్లాలో మేడా రఘునాథరెడ్డి క్రియాశీలకంగా వ్యవహరించనున్నారు. అంతేకాకుండా రాయచోటి నియోజకవర్గం లక్కిరెడ్డిపల్లెకు చెందిన మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డిని కూడా హిందూపురం నియోజకవర్గ పరిశీలకులుగా పార్టీ నియమించింది. ఎక్కడికక్కడ జిల్లాలో అందరినీ సమన్వయం చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్ఫలితాలు సాధించేలా, ప్రభుత్వంపై అలుపెరగని పోరాటాలు చేయడమే లక్ష్యంగా పరిశీలకులను నిమించారు.

ఆత్మస్థైర్యంతో మహిళలు ముందుకు సాగాలి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: పని ప్రదేశంలో ఏర్పడే సమస్యలను మహిళా ఉద్యోగులు ఆత్మస్థైర్యంతో ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో అమరావతి ఏపీజేఏసీ జిల్లా శాఖ ఏర్పాటు చేసిన షీ బాక్స్‌ను మహిళా ఉద్యోగులతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సులో మహిళా ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళల సమస్యలపై షీ బాక్స్‌ను ఏర్పాటు చేయడం శుభపరిణామమని తెలిపారు. వాస్తవిక సమాచారం, ఆధారాలతో తమ దృష్టికి వచ్చిన ఏ సమస్యనైనా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ ఒక మహిళా ఉద్యోగికి ఏదైనా సమస్య వస్తే తోటి మహిళా ఉద్యోగులు అండగా ఉండాలన్నారు. అమరావతి ఏపీజేఏసీ జిల్లా చైర్మన్, రాయచోటి తహసీల్దార్ నరసింహ కుమార్, జనరల్ సెక్రటరీ వైష్ణవి మాట్లాడుతూ జిల్లాలో మూడు డివిజన్లలో తమ శాఖ సబ్ కమిటీలు ఏర్పాటు చేసి, మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ మధుసూదన్ రావు, ఏపీజేఏసీ మహిళా ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్, పక్కన జేసీ ఆదర్శ రాజేంద్రన్

సేవ ముసుగులో దోపిడీ

- ఫాస్టాక్ ట్రైనింగ్ పార్ట్నర్ సంస్థ నిర్వాకం
- హోటళ్లు, మాంసం దుకాణాల నుంచి వసూళ్లు
- 'కూటమి' అండదండలతో రెచ్చిపోతున్న వైనం
- బెంబేలెత్తుతున్న వ్యాపారులు



రాయచోటిలోని మాంసం దుకాణం దగ్గరికి డబ్బు వసూలు కోసం వచ్చిన ఫాస్టాక్ ట్రైనింగ్ పార్ట్నర్ సంస్థ సిబ్బంది



రూ.1770 వసూలు చేసినట్లు ఇచ్చిన రశీదు

రాయచోటి: సేవ ముసుగులో ఓ స్వచ్ఛంద సంస్థ వసూళ్ల దందాకు పాల్పడుతోంది. సేవ చేస్తామని ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకొచ్చుకుంది. అయితే అక్రమ సంపాదనకు తెర తీసింది. ఈ ఆదాయంలో పై నుంచి కింది దాకా వాటాలు ఉన్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ సంస్థను పై స్థాయి నేతలే రంగంలోకి దింపారనే విమర్శలు ఉన్నాయి. ఇదొక ఆదాయ మార్గంగా ఎంచుకున్నారనే వాదన వినిపిస్తోంది.

దర్జాగా రశీదులు ఇస్తూ..

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో కిలో చికెన్‌పై పది రూపాయల దందా వసూలు అనే విషయాన్ని మరువకముందే.. రాయచోటిలో చికెన్, చికెన్ పకోడి కేంద్రాలు, హోటళ్ల నుంచి ప్రైవేటు సంస్థలకు వేలకు వేల రూపాయలు వాంతున్న లక్షలాది రూపాయలను వసూళ్లు చేస్తుండటంపై వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రైవేటు సంస్థల పేరుతో సాగుతున్న ఈ దందాపై స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా.. ఆగడం లేదని వ్యాపారస్తులు వాపోతున్నారు. ఇంత దోపిడీ జరుగుతున్నా ఫుడ్ షేఫ్టీ అధికారులు మాత్రం.. నిద్ర మత్తు నుంచి లేవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. వసూలు చేస్తున్న మొత్తంలో స్థానిక మున్సిపల్, ఫుడ్ షేఫ్టీ అధికారులకు వాటాలు ఇస్తున్నారని, అందువల్లనే వారి వైపు నుంచి చర్యలు లేవని వ్యాపారస్తులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. అధికార పార్టీ పేరు చెప్పి అక్రమ వసూళ్ల దందా అధికమైందంటున్నారు. వ్యాపారాలు లేక ఆర్థికంగా చితికి పోతున్న వ్యాపారులు.. ప్రత్యేక వసూళ్ల దాడులతో కుదేలవుతున్నారు. ఒక్కొక్క షాపు నుంచి వేలకు వేల రూపాయలు అపరాధ రుసుం పేరుతో వసూలు చేయడమే కాకుండా.. తీసుకున్న డబ్బులకు సంస్థ పేరుతో దర్జాగా రశీదులు ఇస్తుండటం జిల్లా కేంద్రమైన రాయచోటిలో కనిపిస్తుంది.

కైవంజి బాబా గ్రామీణ వికాస్ ఆధ్వర్యంలో..


రాయచోటి మున్సిపాల్టీ పరిధిలో ఫాస్టాక్ ట్రైనింగ్ పార్ట్నర్ పేరుతో కైవంజి బాబా గ్రామీణ వికాస్ మండల ఆధ్వర్యంలో.. మాంసం దుకాణాలు, హోటళ్లు, పకోడి సెంటర్లు, టీ దుకాణాల దగ్గర వేలకు వేల రూపాయలు డబ్బులు వసూలు చేస్తూ రశీదులు ఇస్తున్నారు. 'మేము చెప్పినంత డబ్బులు ఇవ్వక పోతే, మీపైన కేసులు బుక్ చేస్తామని, ఆపై మీరు కోర్టులకు తిరగాల్సి వస్తుంది' అని భయభ్రాంతాలకు చేస్తున్నట్లు సమాచారం. అక్రమ వసూళ్లపైన మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో చేసేదిలేక.. వారు అడిగినంత డబ్బులు ఇచ్చి రశీదులు పొందుతున్నారు.

ఇదీ వారి బాధ్యత

ఫుడ్ షేఫ్టీ అధికారులు దుకాణాల యజమానులు, హోటళ్లలో పని చేస్తున్న కార్మికులకు మంచి ఆహారం, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. ఆ శాఖ పరిధిలో తగినంత సిబ్బంది లేకపోవడంతో ప్రభుత్వం ఈ అవగాహన కార్యక్రమాల నిర్వహణ బాధ్యతను ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. ఈ క్రమంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో కైవంజి బాబా గ్రామీణ వికాస్ మండల ఆధ్వర్యంలో ఏర్పాటైన ఫాస్టాక్ ట్రైనింగ్ పార్ట్నర్ సంస్థ.. హోటళ్లు, చికెన్ సెంటర్లు, టీ దుకాణాల యజమానులకు అందులో పని చేసే వర్కర్లను ఒక చోటికి పిలిచి అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. ఇలా అవగాహన కార్యక్రమాలను నిర్వహించడానికి ఒక్కొక్క హోటల్, చికెన్ సెంటర్ల నుంచి రూ.300 నుంచి రూ. 500 వరకు చార్జ్ రూపంలో పొందడానికి అనుమతులు ఉన్నాయి.

అవగాహన కార్యక్రమాలు పక్కన పెట్టి..

అవగాహన కార్యక్రమాలను ఎక్కడా నిర్వహించిన పాపాన పోలేదు. ప్రభుత్వ సూచనలను పక్కనపెట్టి ఆ సంస్థ యాజమాన్యం సిబ్బందిని నేరుగా హోటళ్ల దగ్గరకు పంపి.. అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ రశీదులు ఇవ్వడం గమనార్హం. ఈ దందా రాయచోటిలో ఆరు, ఏడు నెలలుగా కొనసాగుతున్నట్లు వ్యాపారులు వాపోతున్నారు. ఒక రాయచోటిలోనే లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారంటే జిల్లా వ్యాప్తంగా వీరి వసూళ్లు కోట్ల రూపాయలు ఉంటాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇలా చేస్తున్న వసూళ్లలో స్థానిక మున్సిపల్, ఫుడ్ షేఫ్టీ అధికారులకు తగిన మొత్తంలో మామూళ్లను అందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



ఫిర్యాదులు వచ్చాయి

హోటళ్లు, చికెన్ సెంటర్ల దగ్గర అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు వచ్చాయి. ప్రభుత్వం సూచించిన మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నామినల్ రుసుంతో పొందాల్సి ఉంది. ఫిర్యాదులపై మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషాతో కలిసి.. సంస్థ వారిని పిలిచి డబ్బులు వసూలు చేస్తే కేసులు పెడతామని హెచ్చరించాం. అయినా తిరిగి అక్కడక్కడా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. తగిన చర్యలు చేపడతాం.

– వాసు, మున్సిపల్ కమిషనర్, రాయచోటి

మెరుగైన సౌకర్యాల కల్పనకు ఆర్టీసీ కృషి

ఆర్టీసీ జోనల్‌చైర్మన్ పూల నాగరాజు



ఆర్టీసీ గ్యారేజీలో పర్యటిస్తున్న జోనల్ చైర్మన్ నాగరాజు

కడప కోటిరెడ్డిసర్కిల్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆర్టీసీ ప్రయాణికుల మెరుగైన సౌకర్యాల కల్పనకు అన్ని చర్యలు చేపడుతోందని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు తెలిపారు. జోనల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాక మంగళవారం తొలిసారిగా కడపకు వచ్చిన నాగరాజుకు స్థానిక అధికారులు, యూనియన్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆర్టీసీ బస్టాండు, గ్యారేజీ, ఆర్టీసీ ఆస్పత్రిని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఆ తర్వాత అధికారులు, ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సు ప్రయాణం త్వరలోనే ప్రారంభమవుతుందని, ఈ నేపథ్యంలో తమ పరిశీలనకు వచ్చిన అంశాలను నివేదిక ద్వారా ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. త్వరలోనే ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సులు సైతం ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అలాగే ఉమ్మడి కడపజిల్లాకు చెందిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రితోపాటుస్థానిక ఎమ్మెల్యే మాధవిరెడ్డిని కలిశామని, ఆర్టీసీ పరంగా ప్రయాణికులకు సంబంధించి సమస్యలను చర్చించామని, వాటిని పరిష్కరించి మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో ముందుకు సాగుతామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఈడీ పైడి చంద్రశేఖర్, ఆర్ఎం గోపాల్‌రెడ్డి, డీఎం డిల్లీశ్వరరావు, కార్గో డిప్యూటీ సీటీఎం (ఆపరేషన్స్ అండ్ కమర్షియల్) హరి, కార్గో మేనేజర్ జనార్దన్, అసిస్టెంట్ మేనేజర్లు కన్యాకుమారి, మంజుల పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టరేట్ ఎదుట సీహెచ్ఓల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నాచేస్తున్న వైద్య ఆరోగ్యశాఖకు చెందిన సీహెచ్ఓలు

రాయచోటి అర్బన్ : తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను సత్వరమే పరిష్కరించాలని పలువురు సీహెచ్ఓలు డిమాండ్ చేశారు. మంగళవారం సీహెచ్ఓలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్ఓల యూనియన్ జిల్లా నాయకులు భరత్, శివకుమార్,అహమ్మద్ బాషా మాట్లాడుతూ ఆరేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న సీహెచ్ఓలను క్రమబద్ధీకరించాలన్నారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారం విషయమై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు.

దాడి ఘటనపై కేసు నమోదు

మదనపల్లె : భూవివాదం కారణంగా జరిగిన దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పట్టణంలోని పీఅండ్‌టీ కాలనీకి చెందిన జి.రామాంజులుకు దేవతానగర్ వద్ద వారసత్వంగా సంక్రమించిన భూమి సర్వే నెంబర్.90లో ఉంది. అందులో సోమవారం సాయంత్రం ఔషధ మొక్కలు నాటుకుంటుండగా, అతడి సోదరుడైన బాలాజీ అడ్డుకుని రామాంజులు, అతడి భార్య నారాయణమ్మలపై దాడి చేశాడు. ఈ ఘటనల్లో బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడైన బాలాజీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మిద్దెపై నుంచి పడి వ్యక్తి మృతి

ములకలచెరువు : నూతనంగా నిర్మించిన ఇంటికి నీళ్లు పడుతుండగా ప్రమాదవశాత్తు కింద పడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని సోంపల్లె పంచాయతీ బిళ్లూరివారిపల్లెకు చెందిన బి. గోవిందురెడ్డి(55) ఇంటి గోడలకు నీళ్లు పట్టే క్రమంలో అదుపుతప్పి కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన గోవిందురెడ్డిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి కుమార్తె తేజస్విని, కుమారుడు ఈశ్వర్‌రెడ్డి సంతానం. మృతదేహానికి సర్పంచు బి. విష్ణువర్ధన్‌రెడ్డి నివాళులు అర్పించారు.

చెన్నైలో రైల్వేకోడూరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



మండల ప్రతాప్ (ఫైల్)

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మండల ప్రతాప్ (30) చెన్నై తిరువళ్లూరులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మండల నాగేంద్ర అన్న సుబ్రమణ్యం కుమారుడు మృతి చెందడంతో పలువురు నాయకులు విచారం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్ సంతాపం ప్రకటించారు.

కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య

బి.కొత్తకోట : కడుపు నొప్పి తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని బడికాయలపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. సీఐ జీవన్ గంగనాథ్ బాబు కథనం మేరకు వివరాలు.. బడికాయలపల్లె గ్రామం జింకదాటినపల్లెకు చెందిన జి.పెద్దరెడ్డప్ప (45) చిన్నచిన్న కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతనికి కడుపు నొప్పి సమస్య ఉండడంతో కొంత కాలంగా ఇబ్బంది పడుతున్నాడు. మంగళవారం నొప్పి అధికం కావడంతో సమీపంలోని ఓ తోటలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

రండి.. ఆడండి.!

మే 1 నుంచి 31 వరకు క్రీడా శిబిరాలు



వేసవి శిబిరంలో హాకీ నేర్చుకుంటున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ : విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలకు పదును పెట్టడానికి జిల్లాలో వేసవి క్రీడా శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ రూపొందించిన కార్యాచరణ ప్రకారం మే 1 నుంచి 31వతేదీ వరకు క్రీడా శిబిరాలు కొనసాగించనున్నారు. జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో శిక్షకుల ఎంపిక కోసం పది రోజుల క్రితం దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం జిల్లాలో 50 కేంద్రాల్లో క్రీడా శిబిరాలు నిర్వహించనున్నారు. దీంతో వేసవి సెలవుల్లో ఖాళీగా ఉండే విద్యార్థులు వారికి ఇష్టమైన క్రీడలో నెల రోజుల పాటు నైపుణ్యం సాధించవచ్చు. శిక్షకులకు క్రీడాసామగ్రికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది.

పక్కా ప్రణాళికతో..

రోజు వారీ క్రీడా శిబిరంలో ఉదయం, సాయంత్రం కోచ్‌లు పర్యవేక్షిస్తారు. ఆటల్లో వారికి మెలకువలు నేర్పిస్తారు.

నేర్పించే క్రీడలు..

అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, చెస్, క్రికెట్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖో-ఖో, సాఫ్ట్‌బాల్, టేబుల్ టెన్నిస్, తైక్వాండో, వాలీబాల్ క్రీడలను విద్యార్థులకు నేర్పించనున్నారు. జిల్లాలో మదనపల్లె, రాజంపేట, రాయచోటి, గుర్రంకొండ, నందలూరు, చిట్వేలి, వాల్మీకిపురం, రైల్వేకోడూరు, నిమ్మనపల్లె, టి.సుండుపల్లి, తంబళ్లపల్లె, చిన్నమండెం, సంబేపల్లి, ఓబులవారిపల్లె ప్రాంతాల్లో కేటాయించిన క్రీడల్లో శిబిరాలు నిర్వహించనున్నారు.

తల్లిదండ్రులూ ఆలోచించండి..



ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన పిల్లల్లో శారీరక, మానసికోల్లాసం కోసం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు తమ పిల్లలను తల్లిదండ్రులు పంపాలి. చదువే కాదు క్రీడలూ అవసరమన్న విషయాన్ని గ్రహించాలి. ఆటల్లో మెలకువలు సాధిస్తే చదువులో కూడా చురుగ్గా ఉంటారు. – గౌస్‌బాషా, డీఎస్‌డీఓ, అన్నమయ్య జిల్లా

ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు



బాలకృష్ణ (ఫైల్)

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఉన్న గంగోత్రి చెరువులో ఈతకు దిగిన యువకుడు గల్లంతైన ఘటన మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు.. బి.కొత్తకోటకు చెందిన ముగ్గురు మిత్రులు కారులో సాయంత్రం హార్సిలీ హిల్స్ పర్యటనకు వచ్చారు. దారిలో పంప్ హౌస్ వద్ద ఉన్న గంగోత్రి చెరువు వద్ద ఆగారు. వీరిలో బి.కొత్తకోట జయశ్రీ కాలనీకి చెందిన టైలర్ బాలకృష్ణ (29) చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈత కొడుతూ కొంత దూరం వెళ్లాక గల్లంతయ్యాడు. ఇతన్ని కాపాడేందుకు మిగిలిన మిత్రులు ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. సీఐ జీవన్ గంగనాథ్ బాబు, సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్, సిబ్బంది చెరువు వద్దకు చేరుకున్నారు. అయితే చీకటి కావడంతో గాలింపు చర్యలకు ఆటంకం కలిగింది. దీంతో బుధవారం గాలిస్తామని వెనుదిరిగి వెళ్లిపోయారు. గంగోత్రి వద్దకు బాలకృష్ణ కుటుంబీకులు, మిత్రులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

వ్యక్తి అదృశ్యం



మునయ్య (ఫైల్)

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చేనువారిపల్లికి చెందిన దారా మునయ్య అనే వ్యక్తి కనిపించలేదని మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని మలకాటపల్లి చీరాల అచ్చమ్మ అనే మహిళ దహన సంస్కారాలకు దారా మునయ్య ఏపీ26సిడి 0027 నెంబరుగల బైక్‌లో వెళ్లి తిరిగి వస్తుండగా మంటపంపల్లి సమీపంలో ఉదయం 11 గంటలకు ఫోన్ ద్వారా అందుబాటులో ఉన్నాడు. అయితే ఆ తరువాత మునయ్యకు ఫోన్ చేస్తుంటే స్విచ్ ఆఫ్ వస్తోంది. దీంతో అతని పెద్ద కుమారుడు డి.కళ్యాణ్ తోపాటు బంధువులు తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించడం లేదు. దీం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలికపై అత్యాచారం

– పోక్సో కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో సప్లయర్ షాపు యజమానిపై రూరల్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన మైనర్ బాలిక ఓ హోటల్‌లో పని చేస్తోంది. మైదుకూరు రోడ్డులోని సప్లయర్ షాపు యజమాని సుధాకర్‌శర్మ తరచూ హోటల్‌కు టిఫిన్ చేయడానికి వెళ్తూ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. మాయమాటలు చెప్పి బాలికను పలు మార్లు బయటికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో తనకు కడుపు నొప్పిగా ఉందని చెప్పడంతో బాలికను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు చేయగా బాలిక గర్భం దాల్చినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు సుధాకర్‌శర్మపై పోక్సో కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

అంగరంగ వైభవం..

చెన్న కేశవుని చందనోత్సవం



నెమలి వాహనంపై కొలువు దీరిన వైద్య నాథ స్వామికి జరిగిన పూజల్లో పుష్పగిరి పీఠాధిపతి



చందనోత్సవ అలంకార భూషితుడైన చెన్నకేశవ స్వామి

వల్లూరు : పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి, శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో శ్రీ చెన్న కేశవ స్వామి మూల విరాట్‌కు చందనోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం చందనంతో ప్రత్యేకంగా అలంకరించారు. చందన భూషితుడై తేజోవంతంగా కనిపిస్తూ చల్లని దీవెనలందిస్తున్న స్వామిని దర్శించుకుని భక్తులు తరించారు.

పుష్పగిరి గ్రామంలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైద్యనాథేశ్వరునికి అభిషేకాలు నిర్వహించారు. శ్రీ చక్ర సహిత కామాక్షీ దేవి అమ్మవారికి కుంకుమార్చన జరిపారు. రాత్రి పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి స్వామి ఆధ్వర్యంలో నెమలి వాహనంపై కొలువు దీరిన శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలతో స్వామివారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చెన్న కేశవ స్వామి హనుమంత వాహనంపై దర్శనమిచ్చారు.

పుష్పగిరిలో నేడు అక్షయ తదియ ఉత్సవాలు

బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం అతి ముఖ్యమైన అక్షయ తదియ తిరునాల ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్నారు. ఉదయం చెన్న కేశవునికి పూలంగి సేవ జరుగుతుంది. రాత్రి జరిగే వైద్యనాథుడి నందివాహన సేవకు, శ్రీ చెన్న కేశవుని గరుడ వాహన సేవకు విశేష సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

సింహాద్రిపురం : మండలంలోని కోవరంగుంటపల్లె గ్రామానికి చెందిన ఆశీర్వాదం(19) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మట్కా నిర్వాహకులు అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంజీవయ్య నగర్‌లో మట్కా జూదం ఆడుతున్నారని సమాచారం రావడంతో సీఐ సిబ్బందితో కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. రూ. 26,500 నగదు, మట్కా స్లిప్పులను స్వాధీనం చేసుకున్నారు.

బసినికొండ ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు

సాక్షి ఎఫెక్ట్..



టీడీపీ నాయకులు ఆక్రమణకు యత్నించిన స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

మదనపల్లె : బసినికొండలో టీడీపీ బరితెగింపు శీర్షికతో మంగళవారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారుల నుంచి స్పందన లభించింది. బసినికొండ రెవెన్యూ గ్రామం సర్వే నంబర్.682–బీలోని 2.74 ఎకరాల విస్తీర్ణంలోని భూమి ప్రభుత్వానికి చెందినదని, ఎవరైనా ప్రవేశించినా, ఆక్రమించినా శిక్షార్హులంటూ రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే, అంతకుముందే బసినికొండకు చెందిన టీడీపీ మైనారిటీ నాయకుడు ఎస్.ఎం.రఫీ వివాద స్థలంలో మీడియా సమావేశం ఏర్పాటుచేసి, సర్వే నంబర్.682–బిలో చాలా కాలం క్రితమే పట్టాలు మంజూరు చేశారని, అప్పుడు ఇళ్లు నిర్మించేందుకు ప్రయత్నిస్తే కొందరు అడ్డుకున్నారన్నారు. తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చేసేదిలేక ఊరుకున్నామన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇళ్లు నిర్మించేందుకు స్థలాన్ని జేసీబీతో శుభ్రం చేయిస్తుంటే, ఆక్రమిస్తున్నారంటూ సాక్షిలో వార్త రాశారని, తమ వద్ద భూమికి సంబంధించి డాక్యుమెంట్లు ఉన్నాయంటూ జిరాక్స్ కాపీలు చూపించారు. అనంతరం కొద్ది గంటల తర్వాత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భరత్, వీఆర్‌ఓలతో కలిసి టీడీపీ నాయకులు ఆక్రమించేందుకు ప్రయత్నించిన స్థలంలోకి వెళ్లి ఎఫ్ఎంబీ, విలేజ్ రెవెన్యూ మ్యాప్ తదితర రికార్డులను పరిశీలించి, సర్వేనెంబర్.382–బీలోని 2.74 ఎకరాల భూమి ప్రభుత్వ గయాళు స్థలంగా నిర్ధారించారు. హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

అడవిలో మంటలు ఆర్పిన అటవీ సిబ్బంది



కడప రేంజి భాకరాపేట బీటులో చెట్ల కొమ్మలతో మంటలను ఆర్పుతున్న అటవీ సిబ్బంది

సిద్ధవటం : కడప రేంజి పరిధిలోని భాకరాపేట బీటులో ఆకతాయిలు అడవికి నిప్పు పెట్టడంతో సోమవారం సాయంత్రం అటవీ సిబ్బంది ఆ ప్రాంతంలో మంటలను అదుపులోకి తీసుకొచ్చారని కడప రేంజర్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కడప ఫారెస్టు రేంజి పరిధిలోని భాకరాపేట బీటు పాలకొండ అటవీ ప్రాంతంలో ఆకతాయిలు కొండకు నిప్పు పెట్టడంతో మంటలు ఎగిసి పడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. అటవీ సిబ్బంది అప్రమత్తమై ఎగిసి పడుతున్న మంటలను వాటర్ పంపులు, చెట్ల కొమ్మలను ఉపయోగించి పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారన్నారు. అటవీ ప్రాంతానికి నిప్పు పెట్టడం వల్ల వన్య ప్రాణులు అంతరించి పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎస్. ఓబులేసు, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎఫ్‌బీఓలు ఇందిర, రాజశేఖర్‌రాజు, భాను కిషోర్, ప్రొటెక్షన్ వాచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల పట్ల అసభ్య ప్రవర్తన

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీ మంగంపేట పాఠశాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్ మహిళలపై సూపర్ వైజర్ జమాల్ అసభ్యకరంగా ప్రవర్తించాడని మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గతంలో సూపర్ వైజర్ జమాల్ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా నెలరోజుల పాటు విధుల నుంచి తొలగించారన్నారు. అయితే మరలా అతన్ని ఏపీఎండీసీ పాఠశాల యాజమాన్యం విధుల్లోకి తీసుకుందన్నారు. ఈ క్రమంలో మహిళా కేర్ టేకర్ లక్ష్మీ శనివారం మధ్యాహ్నం గార్డన్‌లో పని చేస్తుండగా జమాల్ ఫొటోలు తీశాడన్నారు. ఆమె ఎందుకు ఫొటోలు తీస్తున్నావని అడిగినందుకు అసభ్యకరంగా మాట్లాడి బెదిరించి దాడికి యత్నించాడన్నారు. ఇతని వేధింపులపై ఇప్పటికే ఏపీఎండీసీ సీపీఓ సుదర్శన్ రెడ్డికి, ప్రధానోపాధ్యాయురాలు రేవతికి ఫిర్యాదు చేశామన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ జమాల్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.పెంచలయ్య, బాధితులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో మే 4న నీట్ యూజీ–2025 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డు రూమ్ హాలులో నీట్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై నీట్ యూజీ అధికారులు, విద్యా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రొద్దుటూరులో రెండు పరీక్ష కేంద్రాలు, కడప జిల్లా కేంద్రంలో ఆరు పరీక్ష కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఈ పరీక్షల్లో మొత్తం 2428 మంది విద్యార్థులు హాజరవుతారని ఆయన తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఆఫ్ లైన్ విధానంలో జరుగుతుందని చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు, జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్, కడప కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ నీట్ సిటీ కోఆర్డినేటర్ మునిష్ మీనా, నీట్ ప్రొద్దుటూరు సిటీ కోఆర్డినేటర్ గంగయ్య, నీట్ యూజీ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

కడప మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వేసవి సెలవుల రద్దీ దృష్ట్యా కడప మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను ప్రవేశ పెట్టారని చీఫ్ రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. మే 8, 15, 22, 29 తేదీలలో హైదరాబాదు చర్లపల్లిలో సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రైల్వేకోడూరు, రేణిగుంట మీదుగా తిరుపతికి మరుసటిరోజు ఉదయం 9.40 గంటలకు చేరుతుందన్నారు. 9, 16, 23, 30 తేదీలలో శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజామున 4.30 గంటలకు చర్లపల్లి చేరుతుందన్నారు. మరొక రైలు (07253) మే 6, 13, 20, 27, జూన్ 3, 10, 17, 24 తేదీలలో ప్రతి మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు కాజీపేటలో బయలుదేరి ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రైల్వేకోడూరు, రేణిగుంట మీదుగా తిరుపతికి మరుసటిరోజు ఉదయం 9.40 గంటలకు చేరుతుందన్నారు. తిరిగి ఈ రైలు ప్రతి బుధవారం (07254) మే 7, 14, 21, 28, జూన్ 4, 11, 18, 25 తేదీలలో మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.00 గంటలకు కాజీపేట చేరుతుందన్నారు.

ధరలు ఉన్నా.. దిగుబడి సున్నా

ఎండ మబ్బు తెగులుతో గిటకబారుతున్న నిమ్మకాయలు





ఎండమబ్బు తెగులుతో మంగు ఏర్పడిన నిమ్మకాయల నిమ్మ చెట్లకు సోకిన చక్కెర తెగులు

రాయచోటి : ధరలు అనుకూలంగా ఉన్నా మండుతున్న ఎండల కారణంగా దిగుబడినిస్తున్న కాయలకు ఎండ మబ్బు తెగులు సోకి నిమ్మకాయలు గిటకబారి పోతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన అనేక పంటలకు మార్కెట్‌లో తగిన ధరలు లేక అల్లాడుతున్నారు. పులుసు నిమ్మకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నప్పటికీ ఎండలు అధికం కావడంతో చెట్టుకున్న ఆకులకు ముడత రోగం, చెక్కర తెగుళ్లు బారిన పడ్డాయి. ఎండకు కాచిన కాయలపై మంగు ఏర్పడి కాయలు బండరాయిలా పనికిరాకుండా పోతున్నాయి. మండుతున్న ఎండలకు మనుషులు, జంతువులే కాకుండా చెట్లు సైతం మలమల మాడిపోతున్నాయి. మార్కెట్‌లో మంచి ధరలు పలుకుతున్న చెట్లు, కాయలకు సోకుతున్న తెగుళ్ల కారణంగా ఆర్థికంగా నష్టపోతున్నామంటూ నిమ్మ రైతులు కలవరపాటుకు గురవుతున్నారు. మార్కెట్‌లో డజన్ నిమ్మకాయలు రూ. 50లు పైబడే పలుకుతున్నాయి. పెరుగుతున్న వేడి, ఉక్కపోత కారణంగా కూల్ డ్రింక్స్ , ఇతర ద్రవ పదార్థాలలో వినియోగానికి నిమ్మకాయలను అధికంగా కొనుగోలు చేస్తున్నారు. ధరలు అనుకూలగా ఉండటంతో దిగుబడి వచ్చిన పంటకు తెగుళ్లు సోకకుంటే మంచి ధరలతోపాటు లాభాలు ఉండేవని రైతులు చెబుతున్నారు. ఉద్యానవన శాఖ అధికారులను పిలిపించి సోకిన తెగుళ్లపై పరిశోధనలు చేసి మందులు వాడినా తగిన ఫలితాలు రావడం లేదంటున్నారు. కేవలం ఎండలు అధికంగా ఉండటమే కారణమని చెబుతున్నారు.

బొలేరో వాహనం ఢీకొని కూలీకి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన రఘుకుమార్

మదనపల్లె : బొలేరో వాహనం ఢీకొని బీహార్ వలస కూలీ తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం కురబలకోట మండలంలో జరిగింది. బీహార్‌కు చెందిన రఘుకుమార్(24) ఉపాధి నిమిత్తం కురబలకోటకు వచ్చి అంగళ్లు ఫ్లైఓవర్ సమీపంలో ఉన్న నర్సరీ, ఎరువుల ఫ్యాక్టరీలో కూలీగా పనిచేస్తున్నాడు. వంటగ్యాస్ అయిపోవడంతో సిలిండర్ కోసం ద్విచక్రవాహనంలో అంగళ్లుకు వచ్చి తిరిగి వెళుతుండగా, ఫ్లై ఓవర్ సమీపంలో రాయచోటి నుంచి మదనపల్లె వైపు వస్తున్న బొలేరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో రఘుకుమార్ తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.